

# ట్రోజన్ హార్స్

పసుపులేటి గీత

'కుట్లు, అల్లికలతో అందంగా తీర్చిన నీ జీనుని నువ్వు మళ్లీ ధరిస్తావు.
'నీ గిట్టల మీద పారదర్శకపు మచ్చలు కని పించకుండా మేజోళ్లలో దాచేస్తావు.
'గుర్రమూ, రౌతూ కలగలసిన దేహానివి నువ్వు.
'ప్రాచీన రుషుల హఠాత్ సాక్షాత్కారాల భయంలోంచి,
'మెత్తటి మాంసపు తెల్లని భీతి...'

నా రెప్పలకివతల యెహూదా అమిచా కలవరిస్తూ ఉండగానే, రెప్పలకవతల హఠాత్తుగా అది మెత్తటి మాంసపు నీలి భీతిలా కదిలింది. అదలా కదులుతూంటే నిగనిగలాడే కండరాల్లో ఒక మెరుపు కుట్ర జరజర పాకింది. ఊదారంగు దేహనగరంలో మూలమలుపులేవో మెటామోర్ఫిక్ సైఫర్లని డీకోడ్ చేస్తున్నాయి. నల్లటి భయమేదో నన్నావరించింది... ఊదారంగు గుర్రం. ఎప్పుడూ ఊహించలేదు, ఇలాంటి జీవినొకదాన్ని చూడాల్సివస్తుందని, నా పెరట్లో ఇలాంటి అవాంఛనీయ అద్భుతం ఆవిష్కృతమవుతుందని! చీకటి ఇంకా జడలు విప్పుకునే ఉంది. నడి రాత్రిలో నా నిద్రకళ్ల మీద సవారీకి వచ్చిన ఆ చిత్రమైన గుర్రాన్ని చూస్తూ రెప్పవాల్చడం మరచిపోయాను. సరిగ్గా చెప్పాలంటే తుప్పుపట్టిన యంత్రంలా బిగుసుకుపోయాను. జీనును నేలకి విదిల్చి కొట్టి, గుర్రం తన మెత్తని జూలుని నా చూపు మీద పరిచింది. సమ్మోహనంగా ఒళ్లు విరుచుకుని యుగాల వ్యామోహపు బిగి కౌగిలిలో అది నన్ను బంధించింది. యువతుల్ని చంపి, వారి శరీర సువాసనల నుంచి సుగంధ ద్రవ్యాల్ని తయారుచేసే జాన్ బాటీస్ట్ గ్రెన్యూయాలా అది నా ప్రాణాన్ని పీలుస్తోందనిపించింది. కానీ దాని కౌగిలి నుంచి తప్పించుకోవాలనిపించలేదు. నాలో నాడులన్నీ మత్తుగా మూలుగుతున్నాయి.

"ఎవరు నువ్వు...?"

నా చెవిలో తెమ్మెరలాంటి మాట వినబడింది.

"ట్రోజన్ హార్స్...!"

"ఎక్కడి నుంచి వచ్చావసలు?..."

నాలోపలి ప్రశ్నకు జవాబు వెలుపలి నుంచి వచ్చింది.

"శతాబ్దాల యోజనాల్ని దాటుకుని గ్రీకు పురాణాల నుంచి నేనింకా నీలోకి ప్రయాణిస్తూనే ఉన్నాను, ఎక్కడినుంచన్న ప్రశ్నెందుకు...? ఎక్కడికి వెళతావో చెప్పు. కాదు సుమా కల కాదు సుమా.., అమృత పానమున..., అమరగానమున... ఆకస యానానికి నిన్ను తీసుకువెళతా..."

మైమరపంటే ఇదేనా? నేను కలగంటున్నానా... లేక...

"ఎంతసేపని మొద్దులా నిద్రపోతావ్? లే ఇక, తెల్లారింది, మొక్కలకి నీళ్లు పెట్టాలి..." అమ్మ వీపు మీద చరిస్తే దిగ్గున లేచి కూర్చున్నా.

కలేనా... హమ్మయ్యా... కలేకదా! నన్నేదో మోహినీ పిశాచం పట్టుకుందని భయపడిపోయా. పక్క దుప్పట్లు గట్టిగా విదిల్చి మడతపెట్టబోయాను. దుప్పట్లోంచి మెత్తని ఊదారంగు వెంట్రుకలు జారిపడ్డాయి. ఒళ్లు జలదరించింది. వెంటనే పొలంలోకి పరిగెత్తా! కానీ అదెక్కడా కనబడలేదు. నాకేమీ అర్థంకాలేదు.

పాలకంకులు ముదిరిపోతున్నా కండెకి గుప్పెడు గింజలన్నా లేని జొన్నకంకుల్ని చూస్తూ, పొలంలో కలియదిరుగుతున్నాను. వ్యవసాయమంటే నాకు చాలా ఇష్టం. చిన్నప్పటినుంచీ మా పొలాల్లో పనిచేసేవాణ్ణి. నాన్న నేలని చదును చేస్తున్నా, వేరుశెనగ విత్తనాల్ని చాళ్లలో వేస్తున్నా, వెనకే నడుస్తూ, ఆయన్ని అనుకరించే వాణ్ణి. కాళ్ల కింద మట్టిబెడ్డలు పుటుక్కున నలిగి పోతుంటే భలేగా ఉండేది. అందుకే చెప్పు లేసుకొమ్మని అమ్మ శతపోరినా వినేవాడిని కాను. "వాణ్ణి పొలంలోకి చెప్పులేసుకుని వెళ్లమంటావేంటీ? బుద్ధుందా నీకు. పొలమంటే పూజగదిలాంటిది. మట్టి స్పర్శ తగిలితేనే దాని రహస్యం తెలుస్తుంది. చేతులకి గ్లౌజులు తొడు క్కుని పనిచేయమన్నావు కాదు. నీ చాదస్తాలు చాలించు. వాడు అలా మట్టిబిడ్డలా ఎదగడమే మంచిది. ప్రకృతితో ప్రత్యక్ష సంబంధాలు లేని జీవితాలు ప్లాస్టిక్ పూలలాంటివి..."

"బాగుంది.., ఎవరైనా పిల్లలు నాజూగ్గా, శుభ్రం గా పెరగాలనుకుంటారు. మనలాగా వాడు కూడా మట్టి పిసుక్కోవడం నాకిష్టంలేదు..."

ఆరుగాలం కష్టపడే రైతు జీవితమంటే అమ్మకి మొహం మొత్తింది. నాన్నకేమో వ్యవసాయమంటే డబ్బు కూడబెట్టే వృత్తి కాదు. అదొక జీవన విధానమంటా డాయన. అందుకే అగ్రికల్చర్‌లో ఎమ్మెస్సీ చేసి, విదేశాల్లో ఎన్నో మంచి అవకాశాలొచ్చినా కాదనుకుని, ఆయన తన పొలంలో వ్యవసాయం చేయడానికే నిశ్చ యించుకున్నాడు. నిజానికి ఆ వ్యవసాయం మాకు ఇచ్చిందానికంటే పోగొట్టిందే ఎక్కువ. అందుకే అమ్మకి నేను పొలం పనులు చేయడం నచ్చేది కాదు. కానీ నాన్న నుంచి నేర్చుకున్నదాన్ని, నాన్న నుంచి అబ్బిన అభి రుచిని నేను వదులుకోలేకపోయాను. చదువు పూర్త య్యాక, నాన్న లేని లోటుని పూడుస్తూ నేను మా పొలం లో అడుగుపెట్టాను. అమ్మ కూడా నాన్న జ్ఞాపకాల కోసం పొలాన్ని వదులుకోలేకపోయింది. అందుకే నా నిర్ణయానికి అడ్డుచెప్పలేదు. రైతుగా జీవితాన్ని మొదలు పెట్టిందగ్గర్నుంచీ నా పొలంలో రకరకాల పంటల్ని మార్చాను. అంతరపంటల మీద అవగాహన పెంచు కున్నాను. బిందుసేద్యంతో పుచ్చకాయల్ని పండించాను. కానీ విత్తనాల ఎంపికలో తొందరపడి నాసిరకాన్నెంచు కుని నష్టపోవాల్సి వచ్చింది. వరి, వేరుశెనగ వంటివి నా శక్తికీ, అనుభవానికీ సవాళ్లే అయినప్పటికీ దుగ్ధ కొద్దీ చేతులు కాల్చుకున్నాను. ఆధునిక వ్యవసాయ పద్ధతు లంటూ నేను ఎక్కువ దిగుబడుల కోసం కొత్తకొత్త ప్రయోగాలు చేసేవాణ్ణి. వాణిజ్య పంటల మీద ఎంత మోజున్నా, కూరగాయలు, పండ్ల తోటల సాగంటే కూడా నాకిష్టం. అందుకే నా పొలంలో కొంతమేర కూర గాయల్ని సాగు చేస్తున్నాను. కానీ ఆ మొక్కలకి సోకే తెగుళ్లు నాకు కంటి మీద కునుకు లేకుండా చేస్తు న్నాయి. ముఖ్యంగా ఎంతో ఇష్టపడి తెచ్చుకున్న 'అర్కా షీల్' జాతి వంకాయ మొక్కలకి పురుగుపట్టింది. నా మనసు విలవిల్లాడిపోయింది. నిజానికి నేను భోజన ప్రియుణ్ణి. అమ్మ చేసే గుత్తివంకాయ కూరంటే నాకు భలే ఇష్టం. నా తోటలో కాసిన వంకాయల్ని, ఇలా తెంపి, అలా వండుకుంటే దాని రుచి చెప్పతరం కాదంటే నమ్మండి! కానీ ఈ పురుగు నా ఆశల మీద నీళ్లు చల్లేలా ఉంది.

వంగతోటలోకి వెళ్లి అలవాటు చొప్పున రెమ్మ నించి ఒయ్యారంగా వేలాడుతున్న వంకాయనొకదాన్ని నెమ్మదిగా తడిమి చూశాను. లేత ఊదారంగులో నిగనిగలాడుతూ కనిపించిన ఆ వంకాయలో పుచ్చు కోసం వెతికాను. నున్నగా ఎక్కడా వీసమెత్తు తేడా లేకుండా తాజాగా నవనవలాడుతోందది. మనసు తేలిక పడింది. కానీ ఇది మామూలే. ఏదో ఒకటీ, అరా కాయలు ఇలా ఉంటాయి. నిన్నటిదాకా తోట లోపలికి వెళ్లేకొద్దీ నిగనిగలాడే వంకాయల్లో అక్కడక్కడా చిన్న చిన్న రంధ్రాలు..., నా అరచేతిలోని ఆ ఊదారంగు అంతరిక్షపు బ్లాక్‌హోల్స్‌లో నన్ను నేను పోగొట్టుకునే వాణ్ణి. ఈ స్పేస్ ఇన్వేడర్‌లో కాయతొలిచే పురుగు నా పాలిటి ఏలియన్. ఆ ఏలియన్ కోసం కాయలన్నింటినీ తడిమి తడిమి చూశాను. కానీ ఎక్కడా ఒక్క పుచ్చొం కాయ కూడా నాక్కనిపించలేదు. తల తిరిగిపోయింది. ఇదేంటీ, నిన్నటిదాకా లుంగ చుట్టుకుని, రంగు తేల కుండా, పుచ్చిపోయి, నీరసంగా ఉన్న కాయలన్నీ ఇవాళ నవనవలాడిపోతున్నాయి? నా కళ్లని నేనే నమ్మలేక పోతున్నా. అయినా నమ్మాలి మరి, ఇందాకటి అను భవంలాగే ఇది కల కాదనిపించింది. అలా తోటలో పడి నడుస్తుండగానే, తోటకి ఆ చివర ఊదారంగు గుర్రం ఠీవిగా నిలబడి నన్నే చూస్తోంది. గుండె ఆగినంత పనైంది. చుట్టుపక్క పొలాల్లో ఇంకా ఎవరూ పనుల్లోకి దిగలేదు. ఏంచెయ్యాలో పాలుపోలేదు. గంతల్లేని ఆ కళ్లు 'ఇప్పుడేం చేస్తావ్?' అన్నట్టు నన్ను ప్రశ్నిస్తున్నాయి.

ముందీ గుర్రాన్ని దాచేయాలి? అంటే దొంగి లించాలా? బాగుంది, ఇది దొంగతనమెలా అవుతుంది.

అది దానంతటదే నా పొలంలోకి వచ్చింది. గుర్రాల గురించి నాకు తెలిసింది తక్కువే. రైల్వేస్టేషన్ దగ్గర జట్కా బళ్లకి కట్టిన ఎర్రరంగు, మురికిపట్టిన తెల్లరంగు గుర్రాలే తప్ప నేను మా ఊళ్లో పెద్దగా ఎక్కడా గుర్రాల్ని చూళ్లేదు. చూసిన గుర్రాలు కూడా ఎండిన డొక్కలతో, కళ్లకి గంతలతో చావుకి కాళ్లు చాపుకున్నవే. ముస్లిం పెళ్లి కొడుకులు ఊరేగే గుర్రాలు మాత్రం కాస్త కండపుష్టితో కళకళలాడుతూంటాయి. వాటిని కూడా పొరుగూళ్ల నుంచి అద్దెకి తెస్తారట. కానీ ఇప్పుడు నా ముందున్నంత అందమైన, ఆరోగ్యమైన గుర్రాన్ని మా ఊళ్లో ఎక్కడా చూళ్లేదు. ఈ గుర్రం సొంతదారులెవరూ మా ఊళ్లో ఉండే ప్రసక్తే లేదు. ఎక్కడినుంచైనా తప్పించుకుని వచ్చిందా? నేను దీన్ని దాచేస్తే, రేపెప్పుడైనా దీని యజమాని వచ్చి అడిగితే...? అడిగితే, ఏం చేస్తాను... ఇచ్చేస్తాను. పరాయి సొత్తుకి ఆశపడేవాణ్ణి కాను. కానీ దీనికి ఎవరైనా యజమాని ఉన్నారా, లేదా? అయినా అసలీ ప్రపంచంలో ఊదారంగు గుర్రాలుంటాయా? ప్రశ్నలే ప్రశ్నలు... సరే, సందేహాలన్నింటినీ పక్కనబెట్టి ముందు దీన్ని ఎవరికంటా పడకుండా దాచేయాలి, తరువాత ఏం జరిగితే అదే జరుగుతుంది. ఎవరూ రాకపోతే ఓ ఆర్నెల్లు చూసి, దీన్ని నేనే సొంతం చేసుకుంటా. దీన్ని ఎక్కడ దాచాలి? నా మెదడులో పాదరసం స్ప్రింక్లర్ గిర్రున తిరిగింది. నాన్న బతికున్న రోజుల్లో చదువుకోడానికి మా ఇంటి వెనుక దక్షిణంవైపున మట్టిగోడలతో చిన్న గది కట్టుకున్నాడు. దాన్నిండా పుస్తకాలే పుస్తకాలు. కానీ ఆయన చనిపోవడం, నేను కూడా చాలా ఏళ్లపాటు చదువుకోసం బయటూళ్లు పట్టుకు తిరగడంతో ఆ గది నెమ్మదిగా కూలి, పాడుబడింది. పుస్తకాలన్నీ చెదలు పట్టాయి. అమ్మ కొన్ని దాచినా లాభం లేకపోయింది. పొలంపనులు, ఇంటి పనులతో సతమతమయ్యే అమ్మకి ఇక ఆ గదిని బాగుపరచడం వశం కాలేదు. దాన్నలాగే వదిలేశాం. ఎవరూ ఆ పాడుబడిన గదివైపు రారు. ఈ గుర్రాన్ని దాచడానికి అదే సరైన చోటు.

ఆలోచన వచ్చిందే తడవు, మట్టితట్ట, బుట్ట, చీపురు పట్టుకుని ఆ గదిలో దూరిపోయాను. గది రూపాన్ని ఏకబిగిన మారిస్తే ఎవరికైనా అనుమానం వస్తుంది. అందుకే అందులో ఒక మూల కాస్త శుభ్రం చేశాను. ఆగమేఘాల మీద ఊదారంగు గుర్రాన్ని గదిలోకి తోలి తలుపేశాను. నిజానికి దాన్ని నేను గదిలోకి తోలానో, అదే నావెంటపడి అందులోకి వచ్చిందో తెలీదు. మరి గుర్రానికి గడ్డి... గడ్డేమిటీ, మరీ చాదస్తంగా మంచి ఉలవలు పెట్టాలి. అప్పుడది నాకు మచ్చికవుతుంది. అంతా సద్దుమణిగాక, ఎవరినైనా తెచ్చుకుని గుర్రపు స్వారీ కూడా నేర్చుకోవాలి. గుర్రం మీద నా ఆశలు రోజురోజుకు రెట్టింపవుతున్నాయి. నా ఆశలతో పాటే నా వంగతోట కూడా రోజురోజుకీ తెగబలుస్తోంది. ఈసారి దిగుబడి ఊహించుకుంటే నా ఛాతీ ఉప్పొంగిపోతోంది. ఇంతకాలం మా ఇంటి వంటగదికే పరిమితమైన నా వంకాయలు ఇక నుంచీ మార్కెట్టంతా గుమగుమలాడిపోతాయి. ఇకపై ఇతర పంటలన్నీ ఆపేసి, పొలమంతా వంకాయ సాగుకే కేటాయించాలి. రోజులు గడుస్తున్నాయి. పగలంతా ఊదారంగు గుర్రాన్ని పాడుబడిన గదిలో దాచేయడం, రాత్రిపూట వంగతోటలో వదిలిపెట్టడం చేస్తున్నాను. రాత్రల్లా అదక్కడే తిరుగుతుంటుందని నమ్మాను. కానీ అప్పుడప్పుడూ నా పొలాన్ని దాటి కూడా షికార్లు చేసొస్తున్నదని అర్థమైంది. కానీ ఏం చేయను...? గట్టిగా అదిలిస్తే, కొంపలంటుకుంటాయి. అందుకే రాత్రిళ్లు దాని మానానికి దాన్ని వదిలి, తెల్లవారుఝామున గదిలోకి తోలేసేవాణ్ణి. అది మాత్రం నాతో వెటకారాలు మానలేదు. కవ్విస్తుంది, నవ్విస్తుంది. రాత్రల్లా రోజా ఇంచుమించు జాగరణే. ఏ అర్ధరాత్రికో కానీ పడుకోవడం సాధ్యం కావట్లేదు. ఎవరికీ అనుమానం రాకుండా చాలా జాగ్రత్తగా, రహస్యంగా నా పని నేను చేసుకుపోతున్నాను. కానీ ఒకరోజు ఉదయం అమ్మ పెద్ద గావు పెట్టింది. భయంతో పరిగెత్తుకుంటూ వచ్చా.

"ఏంటమ్మా, ఏమైంది?..."

అమ్మ నా ప్రశ్నకి జవాబుచెప్పే పరిస్థితిలో లేదు. భయంతో కొయ్యబారిపోయినట్టు కనిపించింది.

ఏం జరిగిందో ఊహించా, ఎందుకంటే ఆమె ఇప్పుడు పాడుబడిన గది వాకిట్లో నిలుచుని ఉంది. విషయం తెలిసినా ఏమెరగనట్టు, "ఏం జరిగిందమ్మా, ఎందుకలా అరిచావ్?" అంటూ ఆమె భుజాల చుట్టూ చేతులు వేసి, ఇంట్లోకి నెట్టుకు వెళ్లా. ఆమె చూపు మాత్రం పాడుబడిన గదికే అంటుకుపోయింది. గ్లాసుతో మంచినీళ్లు తాగించా, అమ్మ నెమ్మదిగా మామూలు స్థితిలోకి వచ్చింది.

"ఒరే బాబూ... ఆ గదిలో నేనొక విచిత్రాన్ని చూశాన్రా... దాన్లో ఒక ఊదారంగు గుర్రం కూర్చుని ఉందిరా..."

ఆమె మాటలకి నేను కంగారుపళ్లేదు. దాంతో ఆమె మరింత విసుగుతూ, "నీకేరా చెప్పేది, నేను నిజమే చెబుతున్నా, కావాలంటే వెళ్లి చూడు. ఊదా

రంగు గుర్రంరా... లోకంలో ఎక్కడైనా ఊదారంగు గుర్రముంటుందా? ఇదేం మాయదారి జీవంరా...'' అంటూ వణికిపోతోంది అమ్మ.

''అమ్మా, ఆ గుర్రం మనదేనే...''

అమ్మ అర్థంకానట్టు చూసింది. ''మనదేంట్రా, మన బతుక్కి గుర్రాలూ, ఏనుగులూ కూడా వున్నాయా?''

''లేదమ్మా, ఆ గుర్రం మన దగ్గరికొచ్చి దాదాపు మూడునెలలైంది. నేనే దాన్ని ఆ గదిలో దాచిపెట్టా...''

హఠాత్తుగా ఒంటిమీద తేళ్లూ, జెర్రులూ పాకినట్టు, ఆమె నావైపు వెలపరంగా చూసింది. ''నీకేమైందిరా..., అర్థంపర్థం లేకుండా మాట్లాడుతన్నావ్... ఆ ఊదారంగు గుర్రమేంటీ... మన దగ్గరకొచ్చి మూడునెలలవడమేంటీ... పిచ్చిగాని పట్టిందా?''

''అబ్బ అదికాదమ్మా, నేను నిజమే చెబుతున్నా. ఆ గుర్రాన్ని నేనే అక్కడ దాచిపెట్టా...''

''చదవేస్తే ఉండే మతిపోయిందట. పిచ్చి వెధవా... గుర్రాన్ని దాచి పెట్టడమేంట్రా? దాన్ని చూస్తేనే భయంగా ఉంది. ఏవో జానపద కథల్లోంచి తప్పించుకుని వచ్చిన మాయలమరాఠీలా ఉందది...''

గోడకానుకుని కూర్చున్న అమ్మలోంచి ఎడ్వర్డ్ మంచ్ 'స్క్రీమ్' ప్రతిధ్వనిస్తోంది.

''అమ్మా, నువ్వు భయపడుతున్నట్టు అదేదో మాయగుర్రం కాదు. ప్రకృతిలో మనకి తెలీని ఎన్నో వేల జీవజాతులున్నాయమ్మా. బఠాణీగింజంత సీహార్స్‌ని ఈమధ్యనే కనిపెట్టారు. రెండు, మూడేళ్ల క్రితం ప్రపంచంలోని టాక్సానమిస్ట్లు ఇంతవరకూ సైన్స్‌కి తెలీని పద్దెనిమిది వేలకి పైచిలుకు జీవజాతుల్ని కనిపెట్టినట్టు చెప్పారు. ఇది కూడా అలాంటిదే అయి ఉంటుంది...''

''మండినట్టే ఉంది. అదేమో బాబూ నాకు తెలీదు. దాన్ని తరిమేసెయ్...''

''అబ్బ, నువ్వు అనవసరంగా భయపడుతున్నావు. ఇంకొన్నాళ్లాగు. ఎవరూ ఆ గుర్రం కోసం రాలేదనుకో... అప్పుడా ఊదారంగు గుర్రానికి నేనే యజమానినవుతా. ఆ తరువాత పేపర్ల వాళ్లనీ, టీవీ చానెళ్ల వాళ్లని పిలిచి, ఇంటర్వ్యూలిస్తా... అప్పుడు తెలుస్తుంది నీ కొడుకు గొప్పతనమేంటో!'' అమ్మని మభ్యపెట్టడానికి నాకు అంతకంటే మార్గం కనిపించలేదు.

కానీ అమ్మ మాత్రం నా కుతంత్రాల్ని నమ్మినట్టు కనిపించలేదు. ఊదారంగు గుర్రాన్ని తరిమేయాలని పట్టుబట్టింది. ఇక నాలో మహికో-మోంశాంటో నిద్ర లేచాడు.

''అమ్మా, నీకు తెలీని విషయం ఒకటుంది... వింటావా...?''

ఏంటదన్నట్టు చూసింది. ''నేను రాత్రిళ్లు ఆ గుర్రాన్ని మన పొలంలో వదిలి పెడుతున్నాను. అది తిరిగినంత మేరా మన వంగతోట పురుగూ, పుట్రా లేకుండా ఆరోగ్యంగా ఎదిగింది. వంగతోటలోకి వెళ్లి చూడు, చెట్ల నిండా నవనవలాడే కాయలు గుత్తులు, గుత్తులుగా ఉన్నాయ్... దాని పాదం మంచిదమ్మా. అందుకే దాన్ని తరిమేయడానికి మనసొప్పట్లేదు. ఎందుకో అది మనపాలిటి కామధేనువులా అనిపిస్తోందమ్మా. ఈసారి వంగకాపులో రాష్ట్రంలోనే కాదు, దేశంలోనే మన తోట కాపే నెంబర్ వన్ అవుతుందమ్మా. కావాలంటే తోట్లోకెళ్లి నువ్వే చూడు...''

''అంత పని జరిగిందా? అయితే తప్పకుండా ఇదేదో మాయలాడే...''

అమ్మ మాటకి అడ్డు తగులుతూ, ''అపమ్మా, ఇంత చెబుతుంటే అర్థంకాదేం నీకు...?''

నాకు తెలీకుండానే నా గొంతు పెరిగింది. అమ్మకీ, నాకూ మధ్య రోనాల్డ్ ఎమిరీక్ మయన్ క్యాలెండర్‌తో భూమిని రెండుగా చీల్చాడు. అమ్మకి నా మొహంలో చార్లీఫ్రాస్ట్ కనిపించాడు. నాకు అమ్మ ముఖంలో మెగా సునామీ కనిపించింది.

''అదేంకాదు, ఇలాంటివి మంచివి కావు. ప్రకృతికి విరుద్ధమైన దిగుబడులు, లాభాలు మనకొద్దు. అంతగా కావాలంటే వేరే పద్ధతులు చూద్దాం. ఇవాళ్రేపు అంతా సేంద్రియ వ్యవసాయం మంచిందంటున్నారు. నేల కూడా శక్తిని పుంజుకుంటుందట. ఆ పద్ధతిలో పండించే పంట ఆరోగ్యాన్నిక్కూడా చాలా మంచిదట. వాటికి మంచి మార్కెట్ రేటు కూడా ఉంది...''

''ఆర్గానిక్ ఫుడ్ ధరలు మార్కెట్‌లో మండిపోతున్నాయి. డబ్బున్న వాళ్లే తప్ప మామూలు జనం వాటిని కొనరు, తినరు. నువ్వలాంటి భ్రమలేం పెట్టుకోకు...''

''లేదు కన్నా, నిన్నటికి నిన్న టీవీ చానెల్ పేరు గుర్తులేదు కానీ, ఒక చానెల్‌లో కృష్ణాజిల్లా రైతొకాయనతో ఇంటర్వ్యూ చూశా. ఆవుపేడతో ఎరువుల్ని తయారు చేస్తున్నాడు. దాంతో పంట ఆరోగ్యంగా ఎదగడమే కాకుండా, దిగుబడి కూడా ఎక్కువగా ఉంటుందట. ఆవుపేడ, గోమూత్రం, నెయ్యి, పాలు, పెరుగుతో పంచగవ్య అనే ఎరువును తయారుచేయడాన్ని చూపారు. ఇంకా ఆవు కొమ్ములో...''

''మంత్రాలకి చింతకాయలు రాలవు... సంప్రదాయ వ్యవసాయ పద్ధతిలో ఏదీ కుదరకే కదా, నాన్న అన్ని అష్టకష్టాలు పడ్డాడు...''

''సంప్రదాయ వ్యవసాయమంటే మంత్రాలు కావురా, నీ ఊదారంగు గుర్రంతో ఏ చింతకాయలు రాలతాయో అదీ చూద్దాం...''

అమెరికన్ తాబేదార్లకి అనుకూలంగానూ, వ్యతిరేకులకి విఫల ప్రయత్నంగానూ కనిపించిన కోపెన్ హాగెన్ సదస్సులా ఆ వేళకి మా ఇద్దరి మధ్యా చర్చ అటూఇటూ కాకుండా ముగిసింది. అప్పట్నుంచీ అమ్మ నాతో పొడిపొడిగా మాట్లాడడం మొదలుపెట్టింది. ఇదివరకటిలా మేమిద్దరం కలిసిమెలిసి తినడం, మాట్లాడుకోవడం దాదాపు తగ్గిపోయిందనే చెప్పాలి. కానీ నాకు ఊదారంగు గుర్రం మీద మోజు రోజురోజుకీ పెరుగుతోందే తప్ప తరగడంలేదు. పొలంలో జొన్న, కంది పైర్లతోపాటు అన్నీ ఇంకా ఇంకా నీరసించిపోతున్నాయి. ఒక్క వంగతోట మాత్రం కొత్త పెళ్లికూతుర్లా ధగధగలాడిపోతోంది. రోజులు గడుస్తున్నాయి. ఎవరైనా గుర్రం కోసం వస్తారేమోనని ఎదురుచూస్తూనే ఉన్నా. కానీ ఎవ్వరూ రాలేదు. ఒకరోజు రాత్రి గుర్రాన్నెక్కడానికి నానా తంటాలూపడ్డాను కూడా! ఏం ప్రయోజనం లేదు. దాన్నెక్కడానికి నావల్ల కాలేదు. ఎక్కడానికి నేను ప్రయత్నించినకొద్దీ అది అంతకంతకూ ఎత్తు పెరిగి నాకందకుండా తయారైంది. దాన్ని కంట్రోల్‌లోకి తీసుకోవడం నావల్ల అయ్యే పని కాదనిపించింది. అంతటితో పోతే ఫర్వాలేదు. కానీ నెమ్మదిగా అది నా భుజాల మీది కెక్కడం నేర్చింది. ఏమైనా అంటే, 'నీకు కొంచెం కూడా కృతజ్ఞత లేదు, నేను నీ వంగతోటంతా తెగ తిరిగి అలిసిపోయా. నావల్లే కదా తోటింత పచ్చగా ఉంది, ఆమాత్రం నన్నెత్తుకుని తిప్పలేవా?' అంటూ గారాలు పోయేది. దాని మాటల్లో, చూపుల్లో కాలిఫోర్నియన్ జిన్ ఫ్రాండెల్ రెడ్‌వైన్ నామీద వెన్నెల వానై కురిసేది. దాంతో నా నరనరం పట్టుతప్పి, దాని స్వాధీనమైపోయేవాణ్ణి. నా కళ్లూ, కాళ్లూ అదుపు తప్పే దాకా ఊదారంగు గుర్రం నామీద స్వారీ చేసేది. అప్పుడనిపించేది. పొద్దుటే దీన్ని వదిలించేసుకోవాలని! కానీ, వంగతోటని చూడగానే గుర్రం మీద కోపమంతా నిప్పు మీద నీటిబొట్టులా ఇగిరి పోయేది.

'ప్రేమారణ్యంలో పిచ్చిగా మనం ప్రేమించిన వాళ్లని స్వయంగా మనమే నాశనం చేస్తాం.

ఎలాంటి దురాలోచనా లేకుండానే ప్రేమించిన వాళ్లనే మనం నాశనం చేస్తాం.

మన కౌగిలిలో వాళ్లని ఊపిరాడకుండా బంధించేస్తాం.

విను పాపా, విను! విని అర్థం చేసుకో...

కనిపించేదంతా నిజం కాదు.

ఈ ప్రపంచంలో కలలన్నీ మారకద్రవ్యాలే, వాటికీ ఒక వెల ఉంది...' అంటూ బ్రెన్డెన్ పెర్రీ, లీసా గెర్రార్డ్‌లతో కలిసి సూర్యుడు 'డెడ్ కెన్ డ్యాన్స్'తో సూర్యుడు గొంతు కలిపి ఉదయ సంధ్యల్ని ఆలపిస్తూ హఠాత్తుగా ఓరోజు పడమట ఉదయించాడు. ఇదెక్కడి వైపరీత్యమని అడగబోతే, వెలుగునీడల వైపు ఎంకిలా వేలు చూపుతూ, 'తలుపవతల నీకు కాలం మూడింది, వెళ్లి తెరిస్తే తెలుస్తుంది, నీకివాళ దిక్కులు తలకిందులయ్యాయని...' అంటూ సూర్యుడు శాడిస్టిక్‌గా నవ్వాడు. రాత్రేదో, పగలేదో అర్థంకాలేదు. గుర్రాన్ని పొలాల్లోకి వదలాలా, వద్దా అని తన్నుకుంటూ ఉండగానే, కాలం కాని కాలంలో తలుపు తట్టారెవరో... తలుపు తెరవగానే ఏడెనిమిదిమంది పొరుగు రైతులు నిప్పులు చెరుగుతూ నిలుచుని ఉన్నారు.

''ఏంటి... ఏమైంది...?'' గాభరాగా ప్రశ్నించాను.

''ఏమైందని నింపాదిగా అడుగుతున్నావా? ముందా పాపిష్టి గుర్రాన్ని తరిమి పారెయ్. ఎంతో కొంత పచ్చగా కళకళలాడుతూ మాకింత గ్రాసాన్నిస్తున్న పంట పొలాలన్నీ ఆ పాడు గుర్రం దెబ్బకి ఎడారులైపోయాయ్. నీక్కనిపించడం లేదా...'' అంటూ అందరూ ముక్తకంఠంతో మూకుమ్మడి దాడికి దిగారు. నాకు కీళ్లు జారిపోయినట్టయింది. కానీ మేకపోతు గాంభీర్యాన్ని ప్రదర్శిస్తూ.

''ఇంకొక్క మాట మాట్లాడినా ఊరుకునేది లేదు. వానల్లేక మీ పంటలు పాడైపోతే, దానికి గుర్రాన్నంటారేంటీ?'' అంటూ తిరగబడిపోయాను.

''చెబితే అర్థం కాదేంట్రా నీకు..., చెప్పిన మాట వినకపోతే ఏదో ఒకరోజు నువ్వు కూడా మాలాగే ఏడవాల్సి వస్తుంది. మా మాట విని ఆ గుర్రాన్ని వదిలేసెయ్, ఊరి నుంచి తరిమేద్దాం...''

'ఏంకాదు, నా వంగతోట మీద పడ్డాయి మీ కళ్లన్నీ. అది పచ్చగా ఉన్నందుకే మీ ఏడుపు... నిజానికి ఆ గుర్రం నా పొలం దాటి బయటికి రాదు. అలా వస్తే అప్పుడు చూద్దాం. ఇక మీరు చెప్పేది, నేను వినేది ఏమీ లేదు. ముందు బయల్దేరండి...'' అంటూ గద్దించాను.

''నువ్వంత గట్టిగా మాట్లాడితే, భయపడతామనుకున్నావా? ఏదో పొరుగువాడివి కదాని మర్యాదగా నాలుగు మంచి మాటలు చెప్పిపోదామని వచ్చాం. నువ్వు వినేలాలేవు. ఈసారి నీ గుర్రం మా పొలాల్లో

అడుగుపెడితే దాని మక్కెలిరిచేస్తాం, జాగ్రత్త...'' అని హెచ్చరిస్తూ అందరూ వెళ్లిపోయారు. అమ్మ ముఖంలో అర్థంకాని నిర్లిప్తత. ఆమె ఏదైనా మాట్లాడితే బాగుండు నని ఉంది. కానీ ఆమెలో నామీద కించిత్తు సానుభూతి కూడా కనిపించలేదు. ఇప్పుడచ్చంగా భూమ్మీద స్మశానాలన్నీ నా వాకిట్లో సమావేశమైనట్టుంది. సూర్యుడు ఇంకా ఉదయసంధ్యల్ని పాడుతూనే ఉన్నాడు. నా ఒంటరి కొంపలో దెయ్యాల జుగల్‌బందీ మొదలైనట్టు వెన్నెముకలోంచి ఎర్మోఫోబియా జెర్రిలా నా నవ రంధ్రాల్లో పాకింది. నిజంగానే నా గుర్రం కాళ్లు విరగ్గొడ తారేమో?! ఇప్పుడెలా... ఇదేమో చెప్పిన మాట విన దాయె, ఊళ్లో వాళ్ల పొలాల్లోకి అడుగు పెట్టొద్దంటే ఊరుకుంటుందా? అమ్మతో సహా అందరూ నన్ను ఒంటరివాణ్ణి చేసి మాట్లాడుతున్నారు. నా బాధని అర్థం చేసుకునేవాళ్లే లేరా?! అలవిమాలిన మోజుతో మొదటికే మోసమొచ్చిందా, ఇప్పుడు నేను ఊదారంగు గుర్రం లేకుండా సేద్యం చేయడమనే ఊహకే భయపడిపోతున్నాను. ఇంతింత దిగుబళ్లని కళ్లారా చూసిన తరువాత, చూస్తూ, చూస్తూ ఈ అదృష్టాన్ని ఎవరైనా చేజార్చుకుంటారా? ఈ రాత్రి గుర్రానికి నచ్చజెప్పి చూస్తాను. ఇంత కాలం అది ఆడమన్నట్టల్లా ఆడాను. ఈ ఆపదలో అది నా మాట వినకపోతుందా?!

షాక్ ట్రీట్‌మెంట్ తీసుకున్న రోగిలా నేను నీరసంగా ఇంట్లోంచి బయటికి వచ్చాను. సూర్యుడు కనిపించలేదు. ఎప్పట్లా తుమ్మల్లో మునిమాపు నేరేడుపళ్ల గ్రాండ్ గాలాని సెలబ్రేట్ చేసుకుంటోంది. అలాగే దూరాన వున్న వంగతోటని చూస్తూ నిలబడ్డాను. ఇంత జరిగితే అమ్మెందుకు కనీసం నన్ను పలకరించలేదు. అమ్మ మీద చాలా కోపమొచ్చింది. ఆ కోపంతో ఇంకా ఇనుప మేకులా బిగుసుకుపోయి నిలుచున్నాను. బిగుసుకుపోయాననుకున్నాను కానీ, రాత్రి చీకటి ఫోర్క్‌తో నన్ను కొంచెం, కొంచెం గుచ్చెత్తుతుంటే, పాదాలు అలవాటు చొప్పున పాడుబడిన గది వైపు అడుగులు వేశాయి.

''ఇదిగో, ఇవాళ నువ్వు నాకొక మాటివ్వాలి...'' గుర్రం వీపు మీద సున్నితంగా రాస్తూ, అడిగాను.

''అడుక్కో...'' అంటూ మునిపంట కిసుక్కున నవ్వింది.

దాని వాలకం చూస్తే ఎక్కడో కాలింది.

''పిల్లాట కాదు, బుద్ధిగా నా మాట వినకపోతే నీ కాళ్లకే నష్టం...''

''లాభనష్టాల గురించి మాట్లాడకు, నావల్ల ఏ లాభం లేకపోతే నామీద ఇంత ప్రేమ వొలకబోస్తున్నావో తెలుసుకోలేని వెర్రిదాన్నేం కాదు. నాకొచ్చే నష్టం కంటే నీకొచ్చే నష్టమే ఇప్పుడు తక్షణ సమస్య. టిల్టింగ్ ఎట్ విండ్ మిల్స్‌ని ఆపి అసలు కథలోకి రావోయ్ డాన్ క్విహోట్...''

''సరే, నీతో ఇక మాట్లాడడం అనవసరం. నువ్వికపరాయివాళ్ల పొలాల్లో కాలు పెట్టనని నాకు వాగ్దానం చెయ్..., అలా చేస్తేనే ఇక నిన్ను బయటికి వదిలేది, లేకపోతే ఇక్కడే మగ్గి ఛస్తావ్!''

''అయితే చేశాను... ఫో!''

''నమ్మొచ్చా...''

''నువ్వడిగింది వాగ్దానమే కదా, ఆ కాన్సెప్ట్ మీద నీకు నమ్మకముంటే నమ్ము, లేకపోతే లేదంతే...''

ఇప్పుడు నోరెళ్లబెట్టడం నా వంతయింది. ఇంత సులువుగా నా సమస్య పరిష్కారమైపోతుందనుకోలేదు. పలుపు విప్పి, ఊదారంగు గుర్రాన్ని వదిలాను. దాంతో పాటే, నాలుగడుగులు వేద్దామంటే అందకుండా పరుగు లంకించుకుంది.

''ఇదిగో, నిన్నే... నామాట విను, మన పొలందాటి ఎక్కడికీ వెళ్లకు, మాటిచ్చావు మర్చిపోకు...'' అంటూ వెంటపడ్డాను.

కానీ అందనంత దూరంలో నిలబడి, రెక్కలు విప్పి, ''వాగ్దానాలు కూడా గుడ్లలాంటివే, పుటుక్కున పగిలిపోతాయన్న డానిష్ సామెత వినలేదా అమాయకుడా...'' అంటూ అదృశ్యమైంది. నా నెత్తిన ఇంటర్నేషనల్ స్పేస్ స్టేషన్ విరిగి పడ్డట్టయ్యింది. 'ద్రోహి...' అని పళ్లు నూరుకుంటూ ఇంట్లోకొచ్చిపడ్డాను. అమ్మ ఆసరికే పడుకున్నట్టుంది. కొడుకు ఎంత క్లిష్ట పరిస్థితిలో ఉన్నాడో పట్టించుకోకుండా నిద్రపోతున్న అమ్మని చూస్తే, అనాదిగా మాతృత్వం చుట్టూ అల్లిన భావజాలమంతా బూజు కర్రకి తగులుకున్న సాలెగూడులా నాలో ఛిద్రమైంది. మాడే కడుపుతో అలాగే పక్కమీదికి చేరాను. ఊదారంగు గుర్రం చేసిన మోసాన్ని తలచుకుని నిలువెల్లా రగిలిపోతున్నాను. నా మాట వినని గుర్రం మీద నాకింత కోపముంటే, తన మాట వినని నామీద అమ్మకెంత కోపముంటుందో కదా?! అమ్మ కాళ్లు పట్టుకుని, క్షమించమనాలి... కానీ... కాదులే... అలా చేస్తే అమ్మ నామీద మరింత మండిపడుతుంది. తప్పు చేయనేకూడదు. చేసినప్పుడు దాన్ని సమర్థించుకోగలిగి ఉండాలి. లేకపోతే ఒక్తి చవటాయితనమవు

తుంది. అందరి దృష్టిలో పలచనైపోతాను. గడియారం లో పెద్దముల్లూ, చిన్నముల్లూ ఎడాపెడా దేశాటనం చేస్తున్నాయి. ఈ గుర్రంముండ ఎక్కడెక్కడ తిరిగి ఛస్తోందో, తిరిగి దాన్ని ప్రాణాల్తో చూస్తానో లేదో?! వాళ్లు చెప్పినట్టు దీనికోసం మాటేసి ఉంటారా, దొరికితే ఏ కండకాకండ పీకి చంపేస్తారా?! గుండె లబ్‌డబ్ మనడం మానేసి, పీచుపీచుమంటోంది. రెప్పలు వాలనే వాలమంటూ మొరాయిస్తున్నాయి.

ఇన్‌సోమ్నియాతో రెప్పలు కాలిన ప్రపంచం కళ్ల లోకి కించిత్తు ఓడ్కా జన్యువుని ఇన్‌సర్ట్ చేసి, తిరిగి చూస్తే తలుపుల్లేని నెవర్‌ల్యాండ్‌లోకి పీటర్ పాన్‌గా మేల్కొన్నాను. నేనిప్పుడు చాలా చిన్నవాణ్ణి. బాల్యాన్ని వీడనంటూ మొరాయించే ఎటర్నల్ చైల్డ్‌ని... నా వింతలమారి మెటామార్ఫోసిస్‌ని అర్థం చేసుకుంటూ నెవర్‌ల్యాండ్‌లో కాస్త ముందుకు కదిలాను. ఒక సొరంగం కనిపించింది. దాంట్లోకి దూరి కొంతదూరం నడిచానో లేదో, నా ముందున్నవన్నీ సూపర్‌సైజ్‌లో కనిపిస్తున్న వండర్‌ల్యాండ్ ఒకటి ప్రత్యక్షమైంది. ఒంటరి పిల్లాణ్ణి కదా, ఈ వండర్‌ల్యాండ్‌లో నాకు తోడుగా అలీస్ కనిపిస్తుందేమోనని, వెదుకుతూ నాలుగడుగులు వేశాను.

అంతా చాలా వింతగా ఉంది. ఆశ్చర్యపోతూ నేను భయం, భయంగా అడుగు తీసి అడుగు వేస్తున్నాను. ఇంతలో నా ముందొక ఊదారంగు భారీ ఆకారం దారికి అడ్డంగా నిలబడింది. నాకు నా ఊదా రంగు గుర్రం జ్ఞాపకమొచ్చింది. "హమ్మయ్య, బతికే ఉన్నావా?! నిన్నెవరన్నా చంపేస్తారేమోనని తెగ భయ పడిపోయా," అంటూ దాన్ని తేరిపార చూడడానికి ప్రయత్నించా. "నన్ను ఎవరు చంపినా బాధపడను కానీ, నువ్వే చంపేస్తున్నావే, అదే నా బాధంతా," అందా ఆకారం. మెడ ముందుకు చాపి, మెడ విరిగేలా తలని వెనక్కి వంచి ఆ ఆకారాన్ని చూడడానికి ప్రయత్నిం చాను. అది గుర్రం కాదు. కోలగా, పొట్టీ, పొడుగూ కాని ఆకారం, నెత్తిమీద ఆకుపచ్చ టోపీ... వంకాయ! నా ఎదురుగా ఉన్న ఆకారం వంకాయే! కానీ నేను దాన్ని చంపుతున్నాననటుందేంటీ?! దూరంగా ఏవో కేకలు వినిపిస్తున్నాయి. అలా కేకలు పెడుతున్నదెవరో నాకు అర్థంకాలేదు. కానీ కొన్ని క్షణాల్లో ఏవో చిన్నిచిన్ని ఆకారాలు వంకాయని తరుముకు రావడం నాక్కని పించింది. భయంగా పక్కకి తొలిగి, దొండపాదులో నక్కి దాక్కున్నాను. పైనించి దొండకాయొకటి నన్ను అను మానంగా చూసి కన్నెర్ర చేసింది. అడక్కుండా పాదు లోకి రావడం నా తప్పేమరి! నాతో మాట్లాడ్డానికి వీల్లేని పరిస్థితిలో వంకాయ దగ్గర్లోని వేప్పువ్వులో దాక్కుంది. ఎవరికీ కనిపించకుండా నేను కూడా వంకాయని అను సరిస్తూ, అప్పజెప్పి, నీ మానానికి నువ్వు నెవర్‌ల్యాండ్‌కి వచ్చేశావా?! అంటూ వంకాయ నన్ను చూసి గుడ్లు రిమింది.

"నువ్వేం. మాట్లాడుతున్నావో, నిజంగా నాకర్థం కావడంలేదు. నేను నిన్ను చంపడానికి ప్రయత్నించడ మేంటీ?"

"నంగి వేషాలు కట్టిపెట్టు, ఊదారంగు గుర్రాన్ని నువ్వేకదా నా తోటలోకి వదిలింది..." వంకాయ నా కంట్లో ఎర్రగా వేగుతోంది.

"నిజమే... కానీ దానికీ, నీ మీద జరుగుతున్న దాడికి సంబంధమేంటీ?"

"అది ఒఠ్ఠి గుర్రమనుకున్నావా? ట్రోజన్ హార్స్... అదెవరో తెలీకుండానే దాన్ని పెంచి పోషిస్తున్నావా? అర్భకుడా, నీ అజ్ఞానానికి నేను బలైపోతున్నా కదరా!"

"తన పేరు ట్రోజన్ హార్స్ అని అదే చెప్పింది. దాంట్లో తప్పేముంది?"

"ట్రోజన్ హార్స్ అంటే గ్రీకు పురాణగాథల్లోని ఒక కొయ్యగుర్రం. హెలెన్ ఆఫ్ ట్రాయ్ కోసం ట్రాయ్ మహానగరంపై గ్రీకులకి, అఖియాన్స్‌కి మధ్య జరిగిన సుదీర్ఘ యుద్ధంతో విసిగిపోయిన గ్రీకులు ఓటమిని అంగీకరిస్తూ పారిపోయారు. కానీ పారిపోతూ, పారి పోతూ ఒక పెద్ద సైన్యం పట్టేలా కొయ్యతో ఒక గుర్రం బొమ్మని తయారుచేశారు. అందులో గ్రీకు సైనికులు కూర్చున్నారు. పారిపోయిన మిగతా సైనికుల్ని చూసి శత్రువులంతా తమ ధాటికి పారిపోయారని ట్రాయ్ సైనికులు విజయోత్సవాలు చేసుకుంటూ, ఈ గుర్రం బొమ్మని నగరం నడి బొడ్డున ప్రతిష్ఠించారు. రాత్ర య్యాక బొమ్మలోని ట్రోజన్స్ (సైనికులు) నెమ్మదిగా బయటికి వచ్చి, నగర ద్వారాలు తెరవడంతో, తిరి గొచ్చిన శత్రుసేనలు సులభంగా నగరంలోకి ప్రవేశించి విధ్వంసం సృష్టించాయి. ఈ కథ ఆధారంగానే, మనకి తెలియకుండా మనమధ్యనే ఉండే శత్రువుని ట్రోజన్ హార్స్ అనడం మొదలైంది. అలాంటి ట్రోజన్ హార్స్‌ని ఇప్పుడు నీకు తెలియకుండానే నువ్వు తోటలోకి తెచ్చి వదిలావు. ఇందాక నా మీద దాడికి వచ్చినవాళ్లని చూశావుగా. వాళ్లంతా నీ ఊదారంగు గుర్రం నుంచి వచ్చిన ట్రోజన్సే! నన్ను చంపడానికి కంకణం కట్టు కున్నారు."

"ట్రోజన్సా...?!"

"అవును ట్రోజన్సే... ఈ ట్రోజన్స్ పేరిప్పుడు బాసిల్లస్ తూరింజీయెన్సిస్."

వండర్ల్యాండ్ మీద హఠాత్తుగా జన్యుబాంబు పేలింది. నా చుట్టూ నైట్ ఆఫ్ ది లివింగ్ డెడ్‌లా బాసిల్లస్ తూరింజీయెన్సిస్...

తలుపులు గట్టిగా బాదిన చప్పుడు. ఉలిక్కిపడి లేచా. అమ్మ ఆసరికే కంగారుగా తలుపుతీస్తోంది. తలుపు తీయగానే, కాయతొలిచే పురుగు ఆదుర్దాగా అమ్మని తోసుకుంటూ నా దగ్గరికి వచ్చింది. "నీకు పుణ్యముంటుంది. ఆ ఊదారంగు గుర్రాన్ని తరిమేసేయ్. చేతనైతే చంపేసెయ్..." అంటూ అది గజగజా వణికిపోతోంది. అమ్మ కళ్లు తిరిగి పడిపోయింది. అమ్మ కోసం గాభరాపడుతున్న నన్ను తొందరపెడుతూ, "ఆవిడకేం కాదు. కొంచెం ఆలస్యమైనా ఈ ఊరు ఊరంతా ఎడారైపోతుంది. రా, నాతో రా నీ కళ్లతో నువ్వే చూద్దువుగానీ... ఆ గుర్రం నిజస్వరూపం..." అంటూ నన్ను ఇంచుమించు బయటికి లాక్కెళ్లింది. నా మెదడు మొద్దుబారిపోతోంది. కాయతొలిచే పురుగుతో పాటు నేనూ పరిగెత్తాను.

ఊదారంగు గుర్రం ఊరిపొలాల మీద స్వైర విహారం చేస్తోంది. కానీ ఇప్పుడది నాకు తెలిసిన సమ్మోహనరూపంలో లేదు. పలుచని ఊదారంగు చర్మం కింద నుంచీ దాని ఒళ్లంతా అథోలోకపు వింత జీవులేవో అసహ్యకరంగా పాకుతున్నాయి. దాని జూలు నుంచి ఆరు తలల జెర్రులూ, పాములూ, మండ్ర కప్పలూ, తేళ్లూ వేలాడుతున్నాయి. నాలుక నుంచి మంటలు ఎగసిపడుతున్నాయి. ఒళ్లంతా రక్త, మాంసాలతో అలంకరించుకుంది. దాన్నలా చూడగానే నాకు జుగుప్సో, అసహ్యమో, భయమో తెలియని ఫీలింగ్. అప్రయత్నంగా నా నోట్లోంచి ఒక భీకరమైన చావు కేక...

అది నిప్పులు చెరగుతున్న కళ్లతో నావైపు చూసింది. వికటాట్టహాసం చేస్తూ నా మీదికి వచ్చింది. నేను భయంతో పరుగుతీశాను. కాళ్లలో అంత శక్తి ఎక్కడి నుంచి వచ్చిందో తెలీదు కానీ, పది జవనాశ్వాలు పూన్చిన రథంలా నేను వేగంగా పరుగెత్తుతున్నాను. దానికి పట్టరాని కోపం వచ్చినట్టుంది. వెంటనే అది తన బాసిల్లస్ తూరింజీయెన్సిస్ సైన్యాన్ని నా మీదికి ఉసి గొల్పింది. ఆ బాక్టీరియా నన్ను బంధించడానికి ఒక దట్టమైన మేఘంలా నా వెంటపడింది. నేను పరిగెత్తుతూనే ఉన్నాను. పరిగెత్తినంతమేరా అక్షింతల పురుగులు, పిండి పురుగులు, బ్రింజాల్‌మైట్ వంటి పురుగులతోపాటు ఆకుమాడు తెగులు, వెర్రితెగులు, వైరస్ తెగులు వంటి అనేక తెగుళ్లు కాయతొలిచే పురుగుల శవాల మీద పడి దయనీయంగా రోదిస్తున్నాయి. "మేం నీకు చేసిన చిన్న అపకారానికి, అసలు పంట పొలంలోని జీవధాతువుల్నే బలి తీసుకుంటున్నావు. పురుగులేని వంకాయని సృష్టించడం నీకు గొప్పగా ఉందా? ఎరల్లేని మట్టిని సృష్టించు, తడిలేని వానచినుకుని సృష్టించు. మనిషొక్కడే ప్రకృతికి విరుద్ధంగా జీవించాలనుకుంటున్నాడు. మరణాన్ని సహజాతంగా ఒప్పుకోలేవు. ప్రకృతిచ్చినదేదీ నిన్ను సంతృప్తి పరచడం లేదు. జీవితాన్ని మేం తీసుకున్నంత సహజంగా తీసుకోలేని నీ మానసిక అవిటితనాన్ని ప్రకృతి కూడా ఎంతో కాలం క్షమించదు. పురుగు ఆశించని కాయని నువ్వు సృష్టించగలిగితే, మనిషిని ఆశించని భూమండలాన్ని ప్రకృతి సృష్టించలేదా... ఈ భూమ్మీద నిజమైన కాయతొలిచే పురుగు మనిషే..." అంటూ అవన్నీ నన్ను నానా శాపనార్థాలూ పెడుతున్నాయి.

ఆ పురుగులు, తెగుళ్లూ నన్ను క్షమించేలా లేవు. కానీ నాకు జీవితం విలువ తెలిసింది. ఇంతకాలం ఊదారంగు గుర్రం చుట్టూ నేనల్లుకున్న భ్రమలన్నీ మరణంలోకి అనూదితమవుతాయని ఇప్పుడర్థమైంది. నేను బతకాలి. నేను కూడా బతకాలి. నాతోపాటు జీవ వైవిధ్యాన్ని, ప్రకృతినీ బతికించుకోవాలి. ఇప్పుడెలా? మృత్యువు వెన్నంటి తరుముతోంది. ఎవరైనా నన్నీ పతనావస్థ నుంచి కాపాడితే చాలు! ఎవరు... రక్షించే దెవరు?

పరుగెత్తీ, పరుగెత్తీ నా కాళ్లలో శక్తి సన్నగిల్లుతోంది. ఊదారంగు గుర్రం నుంచీ, దాని బాసిల్లస్ తూరింజీయెన్సిస్ మూకల నుంచీ నన్ను నేను కాపాడుకోగలనన్న విశ్వాసం సన్నగిల్లుతోంది. కాలంతో, దూరంతో నిమిత్తం లేకుండా వేగంగా పరిగెడుతూనే ఉన్నాను. శ్వాస అందడంలేదు. అయిపోయింది. నాకు క్షమాభిక్ష దొరికేలా లేదు. అమ్మనీ... ప్రకృతికి దగ్గరగా జీవించాలన్న ఆమె సలహానీ పెడచెవిన పెట్టినందుకు నాకు తగిన శిక్షే పడేలా ఉంది. గుర్రం ధాటిని ఆపేదె లాగో అర్థం కావడంలేదు. నన్ను వెంబడించీ, వెంబడించీ, ఊదారంగు గుర్రం కూడా రొప్పుతోంది. ఇద్దరం లక్షల యోజనాల దూరాల్ని దాటేశాం. అథోలోకానికి చేరుకున్నాం. నెత్తురోడుతున్న పాదాల్లో జీవశక్తి హరించుకు

పోతున్నట్టుంది. నా కళ్లు మూతలు పడుతున్నాయి. నేను జీవితం మీద ఆశ వదులుకున్నాను. అంతలో హఠాత్తుగా ఎవరో నా చేతిని అంది పుచ్చుకుని ఒక్క దాటున పైకి లాగేశారు. బాసిల్లస్ తూరింజీయెన్సిస్ అథోలోకపు ద్వారాన్ని ఆ చేతులు ఎరలు, మట్టితో కప్పే శాయి. లోపల్నుంచీ ఊదారంగు గుర్రం ఆవేశంగా అరుస్తోంది, "నువ్వు చేసిన ఈ ద్రోహానికి నేను ప్రతిరోజూ నీ మనుషుల్ని వెయ్యిమందిని కబళిస్తా... కబళిస్తా..."

"నువ్వు వెయ్యి ప్రాణాల్ని కబళిస్తే... నేను పదిహేను వందల ప్రాణాల్ని కాపాడతా..." అంటూ నా చేతిని పట్టుకున్న మసనోబు ఫుకువొకా ప్రతిసవాలు విసిరాడు. "చూశావా పరిగెత్తీ, పరిగెత్తీ ఎంత అలసిపోయావో. సుఖ సంతోషాలు పొందాలన్న తాపత్రయంలో వాటిని కోల్పోతామని అర్థం చేసుకోగలిగిననాడు ప్రకృతి వ్యవసాయ సారం బోధపడుతుంది. వ్యవసాయ అంతిమ లక్ష్యం పంటలు పండించడం కాదు, పరిపూర్ణ వ్యక్తిని తయారుచేయడం..." అంటూ ఆయన నాలోపలి బూజు దులిపాడు. మట్టంటిన ఫుకువొకా చేతిలో నా చెయ్యి... కృతజ్ఞత నిండిన నా కళ్లలో రెండు నీటి చెలమలు...

*కలిసిన క్షణాన్నే*
*రెండు నీటి బుడగలూ అదృశ్యం*
*ఒక తామర వికసిస్తుంది*

కిజో మురకమి తామరలో ఫుకువొకా నిద్రకొరిగాడు. నిద్ర నింగిలోని రెండు మట్టి నక్షత్రాలు నా కనుపాపల్ని జోకొడుతున్నాయి. విరిసిన రెప్పలతో నేను జీవితంలో తొలిసారిగా వేకువలోకి మేలుకున్నాను.

అమ్మ నా కళ్లలోకి ప్రశాంతంగా చూసి, వంటింట్లోకి వెళ్లిపోయింది. నేను కాస్త ఒళ్లు విరుచుకుని, పక్క దుప్పటి దులిపి మడతపెట్టబోయాను. దుప్పటంతా మట్టిబెడ్డలు. నా అరచేతిలో మట్టిమరకలు. అమ్మ కోసం వంటింట్లోకి వెళ్లాను. వంకాయల్ని కోస్తూ అమ్మ... పురుగుని చేత్తో తీసి పక్కన పడేస్తోంది... కాయతొలిచే పురుగు నన్ను చూసి కన్నుగీటింది.

*(బి.టి.వంకాయకు నిరసనగా...)*

---

*ఈ కథలోని కొన్ని పదాలకు వివరాలు*

*1. ఆడమ్ జైట్, బ్లిస్టర్ ఏజెంట్, హైడ్రోజన్ సైనేడ్- ఇవన్నీ కెమికల్ వార్‌ఫేర్‌లో ఉపయోగించే ప్రాణాంతక రసాయనాలు.*
*2. సైక్లోసరీన్- రెండో ప్రపంచయుద్ధంలో వాడిన రసాయనిక ఆయుధం.*
*3. పెంటో బార్బిటల్ సోడియం- చైనా, నెదర్లాండ్స్, ఆస్ట్రేలియా తదితర దేశాల్లో యుథనేషియాకి ఉపయోగించిన విషపదార్థం.*
*4. యెహూదా అమిచా- ఇజ్రేలీ కవి.*
*5. జాన్ బాటిస్ట్ గ్రెన్యూయా- ప్యాట్రిక్ సూస్కిండ్ రచించిన నవల ఆధారంగా 2006లో వచ్చిన హాలీవుడ్ చిత్రం 'పెర్‌ఫ్యూమ్: ది స్టోరీ ఆఫ్ ఎ మర్డరర్'లో కథానాయకుడు.*
*6. స్పేస్ ఇన్వేడర్- ఒక వీడియో గేమ్.*
*7. రోనాల్డ్ ఎమిరీక్- హాలీవుడ్ చిత్రం '2012' దర్శకుడు.*
*8. బ్రెన్డెన్ పెర్రీ, లీసా గెర్రార్డ్- వీరిద్దరూ ఐరిష్ జాతీయులైన గాయకులు. 1987లో 'డెడ్ కెన్ డ్యాన్స్' పేరిట వీరి బృందం ఒక మ్యూజిక్ ఆల్బమ్‌ని తెచ్చింది.*
*9. నెవర్‌ల్యాండ్, పీటర్‌పాన్- స్కాటిష్ రచయిత జె.ఎం. బార్రీ 1911లో రచించిన 'పీటర్ అండ్ వెండీ' నవలలోని కల్పిత ప్రపంచం. ఈ నవలలో పీటర్‌పాన్ అద్భుత శక్తులు కలిగిన శాశ్వత బాలుడు.*
*10. బాసిల్లస్ తూరింజీయెన్సిస్- విషతుల్యమైన బ్యాక్టీరియల్ జన్యువు. కాయ తొలిచే పురుగుని రూపుమాపడానికి దీనిని బి.టి. వంకాయ విత్తనాల్లోకి కృత్రిమంగా ప్రవేశపెట్టారు.*
*11. నైట్ ఆఫ్ ది లివింగ్ డెడ్- జార్జి ఎ. రొమిరో దర్శకత్వంలో 1968లో వచ్చిన హాలీవుడ్ హారర్.*
*12. కిజో మురకమి- ప్రసిద్ధ జపనీస్ హైకూ కవి.*

***పాలపిట్ట, మే 2010***

